# అనుమానం ప్రాణసంకటం

జి. రాజగోపాలరావు




మాబావ పేరు సుబ్రమణ్యం. మా బావకు చదువంటే సంకటం చిన్నప్పణ్ణుంచి. అంచాత మా బావ చదువు లోవర్ సెకండరీలోనే గుంట పువ్వులు పూసింది. కాని మా బావకి ఓమంచి ఐడియా (idea) తట్టింది కాఫీ హోటల్ పెట్టి కాలం గడపలేమా అని. వాడనుకొన్నట్టే వాళ్ల తండ్రి—డిస్‌మిసయిన డిప్టీకలెక్టరులెండి—లంచాలు కొట్టి గణించిన డబ్బు కాస్తా పెట్టి కాఫీ హోటలంటూ ఒకటి మౌంటురోడ్డులో పి. ఆర్. అండు సన్సు సమీపానా లేవదీశాడు. అదేం చిత్రమోగాని కాఫీహోటలు పెట్టిన రెండునెలలకే సాక్షాత్ వరాహం అయిపోయాడు. అంటే మీకు అర్థంకాదు కాబోలు. తానుగుడ్డ అయితేగాని మా బావకి ఒక సూటు రాదు. ఈ కాఫీహోటళ్లు పెట్టినవాళ్లు ఏకొట్టులో ఎన్నో నెంబరు బస్తాబియ్యం తింటారో చెప్పమంటే చెప్పరే. వీళ్ల తస్సాదియ్యా. పోనీ మా బావేనా చెప్తాడేమోనంటే అదొక పెద్దరహస్యమంటాడు.

ఇల్లా ఉండగా చదువుకొనికూడ ఆర్.కె.డి. (అనగా రయిసు కిల్లింగు డిపార్టుమెంటు) లో చేరిన నేను మాఆవిడతో సహా మా బావ ఇంట్లోనే కాపురం పెట్టా. ఓనాడు మధ్యాన్నం మొలబంటి బట్టతో—ఎందుకంటే మా బావ బోటివాళ్లకు ఉక్క ఎక్కువగనక—తనగదిలో మంచంపయిన వెల్లకిల—మరేపాశ్చరులో పడుకోవాలన్నా మా బావకి సర్కసు ఫీజేగా—పడుకొని అప్పుడే కొత్తగా ప్రింటయి వచ్చిన "వినోదినీ" సంపుటాన్ని చదువుకుంటూన్నాడు మా బావ ఇంతలో ఎక్కడో కిచకిచ మన్న శబ్దం మా బావ చెవులో పడ్డాది. మా బావ ధైర్యం మీకు తెలియదు గాబోలు. ఓనాడు మాయింట్లో తేలొస్తే చేతులో జోడుచ్చుకొని కూడా మంచంమీద నుంచొని కేకవేస్తాడుగాని పచ్చడికింద కొట్టడే ఇంత ధైర్యస్థుడు ఆచప్పుడు వినేసరికి అప్రయత్నంగా వాసాలమీద పాకుచున్న బల్లికేసి చూశాడు. సరే బల్లేకదా అని మళ్లీ ఏదో చదువుకుంటూ ఉండేసరికల్లా ఎలా పడ్డాదో పాడుబల్లి దానిదుంపతెగా మా బావ బొజ్జమీద పడింది. ఏమిటో పడిందని తన ఫుల్‌స్ట్రెంగ్తు (full strength) ఉపయోగించి

తటాలున లేచి కూర్చున్నాడు ఈయన లేవడంలో ఆబల్లి పాపం బొజ్జమడతలో చిక్కుకొని ఊపిరి తిరగక చచ్చింది

ఈసంగతి మాబావకి తెలియకపోవడంచేత బొజ్జ ఊ తడుముకోడం ప్రారంభించాడు. బల్లి కనుపడక పోగానే అది కడుపులో ప్రవేశించినదని నమ్మేడు ఎంచేతనంటే మాబావ దోవెట్టి నమ్మకం గనక వెంటనే పెద్ద వణుకు జ్వరమున్నూ కేకపెట్టడం మొదలెట్టాడు. ఏమిటా అని నేనొచ్చి చూసేసరికి చెప్పలేని ఆపసోపాలు పడిపోతున్నాడు ఏమిటంటే ఏమీ మాట్లాడడు. వెంటనే మా ఇంటావిణ్ణి వాళ్ళ అన్నదగ్గర ఉండమని చెప్పి నేను పరుగెత్తి కెళ్లి మా డాక్టరుగారిని పిలుచుకొచ్చా. అతడు మాబావని పరీక్షచేసి సాధారణమైన జ్వరమేయని ఏదో మందిచ్చి వెళ్లాడు కాని జ్వరం తగ్గలే.

సరి ఆనాట్నుంచి మంచంమీంచి మరిలేవలే. తిండీ తిప్ప లేమీలేదు. మీరు నమ్మండి నమ్మకపోండి. మీబావ కాఫీహోటలు స్టార్టు (start) చెయ్యకముందు ఎలా ఉండేవాడో అలా తయ్యారయ్యాడు నాల్రోజుల్లో. మాబావ కండిషన్ చూచేసరికి నాకే భయం వేసింది. నాల్గవ రోజున డాక్టరు రంగాచారిగారికి ఫోను చేశా. ఆయనొచ్చి ఇదేదో భయంవల్ల వచ్చిన జ్వరం అని చెప్పి జరిగినసంగతేదో చెప్పమని మాబావ నడిగాడు చెపితే నామూషని కాబోలు, ఏమీ లేదన్నాడు మాబావ ఎన్నివిధాల ప్రశ్నవేశినా ఊఁ అనడు ఆఁ అనడు. ఆయనకు కోపం వచ్చి చెప్తేనే చెప్తావు, లేకుంటే ఆపరేషను (operation) చేస్తానని జడిపించేసరికి మాబావ హడలెత్తి జరిగిన సంగతంతా పూసగుచ్చినట్లు చెప్పేశాడు. సరి చెప్పిందంతా విని మాబావ కళ్లకి గంతలు కట్టి కాస్త సెలైన్ సొలూషన్ (Saline Solution) తాగమని ఇచ్చారాయన. మాబావ ఆమందుని అతికష్టమీద పుచ్చుకొని ఒక పెద్దవాంతి చేసుకున్నాడు. డాక్టరుగారు ఈలోపల ఓచచ్చినబల్లిని తెప్పించి అక్కడ పడేసి మాబావ గంతలు విప్పి "సుబ్రమణ్యం ఇటు చూడు" అని బల్లికేసి చూపించాడు. అప్పుడు మాబావకు కలిగిన ఆనందం ఇంతా అంతా అని చెప్పలేం. సరి ఆమరుచటి నాటికే మాబావ పూర్వపు ఆకారం దాల్చాడు. "ఏం బావ, ఇంతవేగిరం ఎలా బలిశావ్" వంటే సంతోషం సగం బలం అన్నాడు. ఇంతకి చెప్పొచ్చిందేంటంటే మాబావకు అనుమానం లేకపోతే ఇంత ప్రాణసంకటం వస్తుందా చెప్పండి